పైప్‌లైన్ పనులపై అభ్యంతరాలు !

- రైతుల పట్టా భూముల్లో నుంచి భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు
- అడ్డుకుంటున్న రైతులు
- అయినా కొనసాగిస్తున్న అధికారులు



చీకటిమామిడిలో పైపులైన్ కోసం జేసీబీతో గొయ్యి తీయిస్తున్న అధికారులు



వ్యవసాయ భూముల్లో పైపులైన్ వేయొద్దని తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు (ఫైల్)

మునుగోడు : మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఇంటింటికీ కృష్ణా జలాలు సరఫరా చేసేందుకు తవ్వుతున్న ప్రధాన పైపులైన్ పని వివాదాస్పదంగా మారింది. 2004 సంవత్సరానికి ముందు మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కృష్ణా జలాల సంపునకు అప్పట్లో పానగల్ నుంచి పైపులైన్ వేశారు. ఆ పనుల్లో నాణ్యత లోపించడంతో తరచూ పైపులు పగిలిపోవడంతోపాటు ప్రస్తుతం ప్రజలకు సరిపడా నీరు ఆ పైపుల ద్వారా సరఫరా కాకపోవడంతో అధికారులు నూతన పైపులైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం అందుకు రూ. 41 కోట్ల నిధులను 2019లో మంజూరు చేసింది. ఆ నిధులతో రెండేళ్లుగా నూతన పైపులైన్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. నూతన పైపులైన్‌ను నల్లగొండ నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంట మునుగోడు మండలంలోని చీకటిమామిడి గ్రామం వరకు వేశారు. కొన్నిచోట్ల రోడ్డు వెంట అవకాశం లేకపోవడంతో ప్రభుత్వ భూముల్లో నుంచి వేశారు. చీకటిమామిడి గ్రామంలో రోడ్డుకు ఆనుకుని ఇళ్లు ఉండడంతో రోడ్డు వెంట పైపులైన్ వేయడం ఇబ్బందిగా మారింది. దీంతో సంబంధిత అధికారులు ఇళ్ల వెనక భాగంలోని రైతుల భూముల నుంచి పైపులైన్ వేసే పనులు కొనసాగిస్తున్నారు. కానీ ఆ రైతులు తమ వ్యవసాయ భూముల్లో నుంచి పైపులైన్ వేయవద్దని, అన్ని గ్రామాల్లో ఎలా వేశారో అదే తరహాలో తమ గ్రామంలో కూడా వేయాలని. పట్టా భూముల్లో వేస్తే ఊరుకునేది లేదని అధికారులకు తేల్చి చెబుతున్నారు.

కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమైన రైతులు

పైపులైన్ ఏర్పాటుపై గ్రామస్తులు, ప్రజాప్రతినిధులతోపాటు రైతులతో నాలుగైదు నెలలుగా అధికారులు చర్చలు జరుపుతున్నారు. అయితే రోడ్డు వెంట ఇళ్లు నిర్మించుకున్న వారు తమ ఇళ్లను కూల్చివేయవద్దని, ఇళ్ల వెనుక భాగంలో ఉన్న వ్యవసాయ భూముల్లో పైప్‌లైన్ వేయాలని కోరుతున్నారు. రైతులు మాత్రం తమ భూమిలో నుంచి పైపులైన్ వేస్తే తమ భూముల విలువ తగ్గిపోతుందని, నల్లగొండ నుంచి చీకటిమామిడి గ్రామం వరకు ఎలా రోడ్డు వెంట పైపులైన్ వేశారో.. అదే పద్ధతిన వేయాలని అంటున్నారు. చివరకు రైతుల వ్యవసాయ భూముల్లో నుంచే పైప్‌లైన్ వేసేందుకు అధికారులు ఇటీవల పనులు ప్రారంభించారు. దీంతో భూమి నష్టపోతున్న దాదాపు 25 మంది రైతులు పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే సంబంధిత అధికారులు రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో పనులు కొనసాగిస్తున్నారు. దీంతో ఆ రైతులు తమ ప్రమేయం లేకుండా తమ పట్టా భూముల్లో పైపులైన్ వేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు.

నిబంధనల ప్రకారం పనులు కొనసాగిస్తున్నాం

కలెక్టర్, ఆర్డీఓ సూచనల మేరకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆ సమయంలో కొందరు రైతులు అంగీకరించారు. మరి కొందరు వ్యతిరేకించారు. నిబంధనల ప్రకారం పనులు సాగిస్తున్నాం. రైతులు కోర్టును ఆశ్రయిస్తే కోర్టు ఎలాంటి ఉత్తర్వులు జారీచేసినా తప్పకుండా పాటిస్తాం.

– రామకృష్ణ, మిషన్ భగీరథ డీఈ

మా భూముల్లో పైపులు వేస్తే ఊరుకోం



మా భూముల్లోనుంచి మిషన్ భగీరథ పైపులైన్ వేస్తే భూమి విలువ తగ్గిపోతుంది. అన్ని గ్రామాల్లో ఎలా అయితే ఆర్ అండ్‌బీ రోడ్డు వెంట పైపులు వేశారో అలాగే వేసుకోవాలి. మా భూముల్లో వేస్తే ఊరుకోం. త్వరలో కోర్టును ఆశ్రయిస్తాం. అధికారులు దౌర్జన్యం చేసి పైపులైన్ వేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

– పల్లె బుచ్చయ్య, రైతు

కేసీఆర్ నాయకత్వంలోనే గ్రామాల అభివృద్ధి



వడ్డెపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

నాంపల్లి : కేసీఆర్ నాయకత్వంలోనే గ్రామాలు అభివృద్ధికి నిలయాలుగా మారుతున్నాయని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపనలు చేసిన అనంతరం మాట్లాడారు. ప్రతి గ్రామంలో ముందుగా బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగురవేశారు. మండలంలోని ఎస్‌లింగోటం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి, వడ్డెపల్లిలో రూ.40 లక్షలు, నెవిళ్ళగూడెంలో రూ.40 లక్షలు, దామెర గ్రామంలో రూ.55 లక్షలు, నేరళ్ళపల్లిలో రూ.40 లక్షలు, నర్సింహులగూడెంలో రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, అంగన్‌వాడీ భవనానికి 8 లక్షలు, జాన్‌తండాలో రూ.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, నూతన గ్రామ పంచాయతీ భవనానికి రూ.20లక్షలు, రాందాస్‌తండాలో రూ.30 లక్షలు, పెద్దాపురంలో రూ.50 లక్షలు, నాంపల్లికి రూ.కోటి వ్యయంతో సీసీ రోడ్లు, నాంపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో రూ.3 లక్షల వ్యయంతో నీటి సంపు, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో రూ.64 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామంలో కోలాట బృందం మహిళలకు ఎమ్మెల్యే చీరలు పంపిణీ చేశారు. తదుపరి నాంపల్లి గ్రామ పంచాయతీ భవనంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీతో కలిసి సందర్శించి ప్రజలకు అద్దాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేతరవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు బంధు మండల కన్వీనర్, ఇరిగేషన్ డీఈ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి లావణ్యకుమారి, ఏఈ సతీష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, సర్పంచ్‌లు అంగిరెకుల పాండు, దామెర యాదయ్య, విష్ణువర్ధన్‌సాగర్, తస్లీ, జెల్లెల వెంకటమ్మసైదులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుమ్మడపు నర్సింహారావు, పార్టీనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని సన్మానించిన ఎమ్మెల్యే

బెస్ట్ టీచింగ్ అఛీవ్‌మెంట్ 2012–22 అవార్డుకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బిరుదోజు దామోదరాచారిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఎంఈఓ గురువరావుతో కలిసి దామోదరాచారికి అవార్డు అందజేశారు . ప్రధానోపాధ్యాయుడు సంజీవరావు, కత్తి కృష్ణారెడ్డి, కృష్ణయ్య, నారాయణ, మమత, సరేష్, సతీష్ ఉన్నారు.

శంకుస్థాపన వద్ద నాయకుల వాగ్వాదం

నాంపల్లి : మండలంలోని 9 గ్రామాల్లో శంకుస్థాపన కార్యక్రమాలు పూర్తిచేసుకుని చివరకు నాంపల్లి మండల కేంద్రానికి మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి వచ్చారు. ఆ సమయంలో జెడ్పీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ కుంభం విజయ భర్త కృష్ణారెడ్డి వాగ్వాదం చేసుకున్నారు. స్థానికంగా తాను ఉండగా నీ పెత్తనం ఏంటి అని జెడ్పీటీసీపై సర్పంచ్ భర్త వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే చొరవ తీసుకోవడంతో గొడవ సద్దుమణిగింది.

రాష్ట్ర అభివృద్ధిని ఆపాలని చూస్తున్న కేంద్రం

- జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి
- విద్యుత్ ఏఈపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- డబ్బులు ఇచ్చేవారికే స్తంభాలు ఇస్తున్నారని ఆరోపణ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం ఏప్రిల్ మాసం నుంచి నేటివరకు 15వ ఆర్థిక సంఘం నిధులను తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వకుండా కక్ష సాధిస్తూ, రాష్ట్ర అభివృద్ధిని ఆపాలని చూస్తోందని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్యభసమావేశం నిర్వహించారు. ఈ సభలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల నివేదికలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయశాఖ, ఉపాధి హామీ పథకం సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్‌రావు సక్రమంగా విధులకు రావడం లేదని, డబ్బులు ఇచ్చినవారికే స్తంభాలు ఇస్తున్నారని ఆరోపించారు. నార్కట్‌పల్లి వైఎస్‌ఆర్ కాలనీలో కొంతమంది డూప్లికేట్ పట్టాలిస్తున్నారని, ప్రభుత్వ పాట్లు ఆక్రమణకు గురవుతున్నాయని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఏర్పాటుచేయాలని కోరారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో చెరువులు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నార్కట్‌పల్లి పట్టణంలో అద్దె ఇళ్లల్లో ఉండే పేద ప్రజలు ఎవరైనా చనిపోతే ఖర్మకాండలు నిర్వహించేంత వరకు ఉండడానికి రూ.10 లక్షల వ్యయంతో భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రైతు బంధు, రైతు బీమా చేసుకోనివారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా కృషి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరిగౌడ్, ఎంపీడీఓ యాదగిరిగౌడ్, తహసీల్దార్ మురళీమోహన్, ఎంపీటీసీలు మేకల రాజిరెడ్డి, చిరుమర్తి యాదయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, కొంపెల్లి సైదులు, ఉంద్ర భాగ్యమ్మ, దుబ్బాక పావని, సర్పంచ్‌లు గోసుల భద్రాచలం, గంట్ల నర్సిరెడ్డి, బింగి కొండయ్య, నర్సింహ, శేఖర్‌రెడ్డి, లింగస్వామి, శంకర్, మధు, సతీష్, రాజు, దూదిమెట్ల స్రవంతి, సరిత, ఈద మాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్టీసీ కళాజాతా

నకిరేకల్ : ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు నకిరేకల్‌లో మంగళవారం కళాకారులు ఆర్టీసీ కళాజాతా నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ ప్రజలందరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. ఆర్టీసీ కల్పిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్టీసీ డిపో అధికారి నిర్మల, నకిరేకల్ కంట్రోలర్ మున్నాన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణికృష్ణమూర్తి, కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి, గర్శకోటి సైదులు, రాచకొండ సునీల్, బానోతు వెంకన్న పాల్గొన్నారు.

కస్తూరి చరణ్‌కు వినతి

మునుగోడు : మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయానికి మరమ్మతులు చేయించి అభివృద్ధి చేయాలని కోరుతూ గ్రంథపాలకుడు యుగేందర్ మంగళవారం కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన శ్రీచరణ్.. మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి దర్శనం వేణు, పందుల అశోక్ ఉన్నారు.

మార్కండేయ స్వామి జయంతి

నకిరేకల్ : పట్టణంలోని పద్మశాలి భవనంలో శ్రీ మార్కండేయ స్వామి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సంఘ అధ్యక్షుడు దుస్స సత్యనారాయణ, చేనేత సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పార్థసారథి, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి

రామగిరి(నల్లగొండ) : ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు స్పందించడం లేదని తిప్పర్తి మండల ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తిప్పర్తి ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మీలింగారావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అధికారులపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. లైన్‌మెన్‌లు అందుబాటులో ఉండడం లేదని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. ఆరెగూడెం సర్పంచ్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ తమ గ్రామంలో విద్యుత్ స్తంభాలు వేసి సంవత్సరం గడుస్తున్నా ఇంతవరకు వాటికి విద్యుత్ తీగలు బిగించకుండా కాంట్రాక్టర్ అలాగే వదిలేశాడని ఏఈ ఎస్.రమ్య దృష్టికి తీసుకెళ్లారు. సర్వారం గ్రామ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై రెండు నెలలు అవుతున్నా బిగించడం లేదన్నారు. తిప్పర్తి ఎంపీటీసీ మాట్లాడుతూ తిప్పలమ్మగూడెంలో బుర్రి సైదులుకు చెందిన ఆవు విద్యుత్ ప్రమాదంలో చనిపోయి మూడు నెలలు గడుస్తున్నా నష్టపరిహారం అందలేదన్నారు. తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మండలంలో నూతనంగా 5 అంగన్‌వాడీ భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. కాశీవారిగూడెం గ్రామం నుంచి మంజూరైన బీటీ రోడ్డు పనులు పూర్తయ్యేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



చిట్యాలలో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

మునుగోడు : గ్రామాల్లో ఏర్పాటుచేస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రతిఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని సోలిపురం సర్పంచ్ నకిరెకంటి పద్మయాదయ్య కోరారు. మంగళవారం సోలిపురం గ్రామంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన

చిట్యాల : మున్సిపాలిటీ కార్యాలయంలోని కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు పరిశీలించారు. కంటి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, క్యాంపు మెడికల్ ఆఫీసర్ స్రవంతి, చిట్యాల పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్, మల్లికార్జున్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : మండల కేంద్రంతోపాటు ముష్టిపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా టీబీ అధికారి కళ్యాణ్‌చక్రవర్తి మంగళవారం సందర్శించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి మహ్మద్ ఇక్బాల్, ఆశవర్కర్లు సునిత, కవిత, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కేతేపల్లి : మండలంలోని కొర్లపహాడ్, కేతేపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను మంగళవారం మండల స్పెషల్ ఆఫీసర్ రంజిత్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్, మండల వైద్యాధికారి అర్చన తదితరులు ఉన్నారు.

పంట చేల పరిశీలన

కేతేపల్లి : మండలంలోని బొప్పారం, కాసనగోడు గ్రామాల్లో యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పొలాలను మంగళవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఏఓ బి.పురుషోత్తం, రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షుడు లింగయ్య, రైతులు పుణ్యారెడ్డి, వాసు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ ఆడుతున్న దుబ్బాక నర్సింహారెడ్డి

నల్లగొండ : ప్రతిభ గల గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఎన్జీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జిల్లపల్లి పరమేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిమల్ల శంకర్, కౌన్సిలర్లు బొంత శ్రీను, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

కేతేపల్లి : మండలంలోని చెర్కుపల్లి గ్రామానికి చెందిన పెదబొస్క రాములు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. ఆయన అత్యవసర వైద్య ఖర్చుల కోసం మంజూరైన లక్ష రూపాయల ఎల్‌ఓసీ పత్రాన్ని మంగళవారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అందజేశారు. టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనికెర లింగయ్యకు నివాళి

శాలిగౌరారం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, ఎంసీపీఐయూ ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పనికెర లింగయ్య వర్ధంతిని మంగళవారం మండలంలోని గురజాల గ్రామంలో నిర్వహించారు. ఎంసీపీఐయు రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, వరికుప్పల వెంకన్న, సైదయ్య, సైదక్క, గుండా శ్రీనివాస్, మంగళపెల్లి శ్రీనివాస్, వసంత, కృష్ణమోహన్, ఏపూరి సోమన్న, ఉగ్రయ్య, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

నకిరేకల్ : ఐదు మాసాలుగా వేతనాలు అందకపోవడంతో నకిరేకల్ మున్సిపాలిటీ కార్మికులు మంగళవారం తెల్లవారుజాము నుంచి పనులు నిలిపి వేసి సమ్మెకు దిగారు. మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ బాలాజీ వెంటనే కార్మికులతో మాట్లాడి వేతనాలను మూడు రోజుల్లో అందజేస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు కార్మికులు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులు సంఘం గౌరవ అధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్, సంఘం అధ్యక్షుడు వంటిపాక కృష్ణయ్య పాల్గొన్నారు.

28 నుంచి వాలీబాల్ పోటీలు

మునుగోడు : మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మండలంలోని పలివెల గ్రామంలో ఈ నెల 28, 29 తేదీల్లో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. క్రీడాకారులు ఈ నెల 27వ తేదీలోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ టీమ్ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మొదటి బహుమతి రూ. 30,116, రెండో బహుమతి రూ.20,116 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 8074547489, 7036570923 లలో సంప్రదించాలని కోరారు.

ఎన్‌హెచ్ 65 దిగ్బంధనాన్ని విజయవంతం చేయాలి

కేతేపల్లి : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఫిబ్రవరి 12న చేపట్టనున్న 65 నంబరు జాతీయ రహదారి దిగ్బంధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న పిలుపునిచ్చారు. మంగళవారం కేతేపల్లిలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

సహకార సంఘం డైరెక్టర్ల ధర్నా



ధర్నా చేస్తున్న సహకార సంఘం డైరెక్టర్లు

చండూరు : సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా సీఈఓను నియమించారని ఆరోపిస్తూ సహకార సంఘం డైరెక్టర్లు మంగళవారం జరిగిన సమావేశాన్ని బహిష్కరించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కట్ట భిక్షం మాట్లాడుతూ సంఘం నిబంధనలకు విరుద్ధంగా సీఈఓను అధికారులు నియమించారని ఆరోపించారు. వెంటనే సీఈఓను తొలగించాలని డిమాండ్ చేశారు. బోడ ఆంజనేయులు, గిరి సత్తయ్య, మిట్టపల్లి రాజు తదితరులు ఉన్నారు .

డమ్మీ రైఫిల్స్ అందజేత



డమ్మీ రైఫిల్స్ అందజేస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : ఎన్జీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కెడెట్లకు గుత్తా వెంకటరెడ్డి మెమోరియల్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి మంగళవారం 25 డమ్మీ రైఫిల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, పీడీ కడారి మల్లేష్, లైబ్రేరియన్ ఏ.దుర్గాప్రసాద్, బి.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి



గట్టుప్పల మండలంలోని వెల్మకన్నె గ్రామంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

కట్టంగూర్ : ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, సువర్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పరడ, దుగినవెల్లి, కట్టంగూర్‌లోని అంబేద్కర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ బాలికల దినోత్సవం, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్‌ఎం వెంకటేశం, ఇందిర, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పి.సుజాత, ఆర్ రజిత, మంగమ్మ పాల్గొన్నారు.

నకిరేకల్ : జాతీయ బాలికల దినోత్సవాన్ని నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు.ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ , వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, శోభారాణి, హరిత, రాధిక, హబీబ్, మధుసూదన్‌రెడ్డి, జానయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

చండూరు(గట్టుప్పల) : ఆడ పిల్లలకు బాల్య వివాహాలు చేయొద్దని ఏసీడీపీఓ వెంకటమ్మ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా గట్టుప్పల మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. సూపర్‌వైజర్ రంగమ్మ, హెచ్‌ఎం గురునాథ్, అంగన్‌వాడీ టీచర్లు వనజ, సంతోష తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చండూరు మండలం గుండ్రపల్లి, గట్టుప్పల మండలం తేరట్‌పల్లి గ్రామాల్లో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ తీగల సుభాష్, వార్డు సభ్యులు పెండ్యాల గీత, అశోక్ రెడ్డి, టీచర్లు ప్రమీల, ఉషారాణి తదితరులు ఉన్నారు.

మునుగోడు : ఆడపిల్లలపై పెరుగుతున్న అఘాత్యాలను అరికట్టే బాధ్యత అందరిపై ఉందని తహసీల్దార్ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మునుగోడు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్ వైజర్లు రంగమ్మ, అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష తగదు

మర్రిగూడ : సమాజంలో ఆడపిల్లలపై వివక్షత తగదని చింతపల్లి సీడీపీఓ లావణ్యకుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులతోపాటు శివన్నగూడలో నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. అనంతరం బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సర్పంచ్ చిట్యాల సబితాయాదగిరిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు భిక్షమయ్య, లింగయ్య, వాసవి, సూపర్‌వైజర్లు యశోద, పద్మ, పార్వతి, మల్లీశ్వరి, శోభా, లక్ష్మీ, రమాదేవి, విమలాదేవి పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

చండూరు : మున్సిపాలిటీలో వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులందరికీ మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు, పెరిగిన వేతనాల ఏరియర్స్ వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న చండూరు మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సీఐటీయు మండల కన్వీనర్ మోగుదాల వెంకటేశం , గీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు చిన్న వెంకన్న , కత్తుల సైదులు, ఉపాధ్యక్షుడు యస్ లింగస్వామి, కోశాధికారి బి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని చిన్నపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం సూపరింటెండెంట్ జాకీర్‌కు వినతి పత్రం అందజేశారు. నాంపల్లి చంద్రమౌళి, కార్మికులు పాల్గొన్నారు.

పాలకమండలిలో స్థానం కల్పించాలి

మర్రిగూడ : శివన్నగూడ శ్రీ నీలకంఠ రామస్వామి ఆలయ పాలకమండలిలో చర్లగూడెం గ్రామానికి చెందిన ముంపు గ్రామస్తులకు స్థానం కల్పించాలని కోరుతూ భూనిర్వాసితుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి మహేందర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కేశవులు, రాములు,పెదవెంకటయ్య,నర్సింహ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌కు వినతి

నల్లగొండ టౌన్ : బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి ఒక్కో నియోజకవర్గానికి 1500 మందికి దళితబంధు పథకం అమలు చేయాలని కోరుతూ మంగళవారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ప్రతినిధులు అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తాకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, జిట్ట నగేష్, కోటిరెక్క రాధిక, బొల్లు రవీందర్, అంజిబాబు ఉన్నారు.

తాటి ఈత చెట్లను తొలగించొద్దని..

మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామ శివారులోని తాటి, ఈత చెట్లను రియల్ ఎస్టేట్ వ్యాపారులు తొలగిస్తున్నారని, చెట్లను తొలగించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికులు అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. గీత కార్మి కులు కె.కృష్ణయ్య, లక్ష్మయ్య, సైదులు, యల్ల య్య, వీరయ్య, యల్లయ్య, మల్లయ్య ఉన్నారు.

26న ట్రాక్టర్ల ర్యాలీ

నకిరేకల్ : రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర పభుత్వం నేరవెర్చనందుకు నిరసనగా ఈ నెల 26న దేశవ్యాప్తంగా నిర్వహించే ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కందాల ప్రమీల కోరారు. నకిరేకల్‌లో మంగళవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

బెంచీలు బహూకరణ

చిట్యాల : పట్టణంలోని బస్‌స్టేషన్ ఎదురుగా కార్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యుల కోసం నాలుగు సిమెంటు బెంచీలను బీజేపీ రాష్ట్ర నాయకుడు శేపూరి రవీందర్ మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కన్నెబోయిన శ్రీను, బీజేపీ మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహ, ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు మాస శ్రీనివాస్, పార్టీ పట్టణ ప్రధానకార్యదర్శి గంజి గోవర్ధన్, చికిలంమెట్ల అశోక్ పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నల్లగొండ పట్టణంలోని రామగిరిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చకిలం అనిల్‌కుమార్ నివాసంలో నిర్వహించనున్నారు. ఈ సమ్మేళనంలో నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఉద్యమకారులందరూ పాల్గొనేలా చకిలం వర్గీయులు ఏర్పాట్లు చేశారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మర్రిగూడ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మంగళవారం గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ నాయకులతో కలిసి ఎంపీఓ ఝాన్సీకి వినతిపత్రం అందచేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు వట్టిపల్లి హనుమంతు, ఉరిపక్క లింగయ్య, పెరుమాండ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్‌గా బ్రహ్మచారి

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ చైర్మన్‌గా కంచర్ల బ్రహ్మచారి ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం బ్రహ్మచారిని పలువురు ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణికృష్ణమూర్తి, 2, 3వ వార్డుల కౌన్సిలర్లు రాచకొండ సునీల్, స్వాతి, విశ్వ సేవాదళ్ అధ్యక్షుడు నరేంద్రచారి ఉన్నారు.

రేపు సామూహిక అక్షరాభ్యాసం

నల్లగొండ టూటౌన్ : శ్రీ సరస్వతి శిశుమందిర్ నల్లగొండ సమితి ఆధ్వర్యంలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు పట్టణంలోని రవీంద్రనగర్‌లోగల శిశు మందిర్‌లో అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అక్షరాభ్యాసంలో పాల్గొనే చిన్నారులకు నోటుబుక్, పెన్సిల్, భాసర సరస్వతి అమ్మవారి ఫొటో, కుంకుమప్రసాదం అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9640723246, 7396415767 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎరువుల డీలర్లకు అవగాహన

చండూరు : నిబంధనల మేరకు విత్తనాలు, ఎరువుల విక్రయాలు జరపాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్లయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలో ఫర్టిలైజర్ ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్‌పై ఎరువుల డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లైసెన్స్ చండూరు, మర్రిగూడ, మునుగోడు ఏఓలు మల్లేశం, స్పందన, శ్రీనివాస్, ఎరువుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

నకిరేకల్ : టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నాయకత్వంలో వచ్చే ఎన్నికల్లో నకిరేకల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్వైద రవీందర్ అన్నారు. నకిరేకల్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.